సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
సోమవారం | 23 | డిసెంబర్ | 2024



కాళోజీ జీవితం.. విశ్వవ్యాప్తం
పల్లెటూరు అందాలు, కుటుంబ బంధాలు, అనుబంధాలను మేళవిస్తూ సహజ దర్శక నిర్మాతగా డాక్టర్ ప్రభాకర్ జైనీ చక్కటి సినిమాలకు ప్రాణం పోస్తున్నారు. - 8లో▸



ఆత్మీయ కలయిక..
జఫర్‌గఢ్ మండలం కూనూరు ఉన్నత పాఠశాలలో 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30^0/19^0

వాతావరణం
ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

యాదాద్రి ఆలయ స్వర్ణతాపడానికి రూ.5లక్షల విరాళం



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ దివ్య విమానగోపురానికి స్వర్ణ తాపడం కోసం హనుమకొండకు చెందిన వాకా సత్యనారాయణ, జయలలిత దంపతులు ఆదివారం రూ.5,01,116 లక్షల విరాళం అందజేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న అనంతరం దేవస్థానం ఈఓ కార్యాలయంలో అధికారులకు నగదు అందజేశారు.

సర్వే పూర్తి చేయాలి



కాజీపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వే సకాలంలో పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్, వడ్డేపల్లి కాలనీల్లో సర్వేను ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ జి.రవీందర్, హరినాథ్, డీఈ సిద్ధార్థనాయక్ పాల్గొన్నారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, సమస్యల పరిష్కారానికి ఈ వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

30న కౌన్సిల్ సమావేశం

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) కౌన్సిల్ సమావేశం ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ అంకమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశంలో పలు ఎజెండాల్లో అంశాలపై చర్చ జరుగుతుందని, కమిషనర్, ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు, వింగ్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

పరిశోధన పత్రం సమర్పణ



విద్యారణ్యపురి: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీలో ఈనెల 21న నిర్వహించిన రాష్ట్ర స్థాయి మేథమెటిక్స్ సెమినార్‌లో కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ పోగుల అశోక్ పరిశోధన పత్రం సమర్పించారు. (పేపర్ ప్రజెంటేషన్) 'ఎన్‌హాన్సింగ్ క్వాలిఫికేషన్ టెక్నిక్స్ ఇన్ సెకండరీ స్కూల్స్ స్టూడెంట్స్ త్రూ వేదిక్ మేథమెటిక్స్' అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేశ్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా.. పోగుల అశోక్ వచ్చే నెలలో జాతీయ స్థాయిలో జరగబోయే విద్యా సదస్సులోనూ పాల్గొనేందుకు ఇప్పటికే ఆయనకు అవకాశం లభించింది. జాతీయ సదస్సుకు ఎంపికైన పోగుల అశోక్‌ను విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఈసందర్భంగా అభినందించారు.

కేయూలో ఐసెట్ కార్యాలయానికి సీల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలోని ఐసెట్ కార్యాలయానికి రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తాళం వేసి సీల్ చేశారు. 12 ఏళ్లుగా కాకతీయ యూనివర్సిటీయే టీఎస్ఐసెట్ నిర్వహించిన నేపథ్యంలో ఆ కళాశాలలో ప్రత్యేకంగా ఒక హాల్‌ను కార్యాలయంగా ఏర్పాటుచేసి అవసరమైన ఫర్నిచర్, టేబుళ్లు, కంప్యూటర్లు తదితర సామగ్రిని సమకూర్చారు. ఈసారి ఐసెట్ నిర్వహణను ఉన్నత విద్యామండలి కేయూకు అప్పగించకపోవడంతో ఐసెట్ కార్యాలయం నిరుపయోగంగా మారింది. ఈ కార్యాలయం నుంచి రెండు చైర్లు ఎవరో బయటికి తీసుకెళ్లారని ఆరోపిస్తూ రెండురోజుల క్రితం ఒకరు రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. దీంతో ఆయన కళాశాలను సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడ స్టాక్ రిజిస్టర్ మెయింటెన్ చేయడంలేదనేది గుర్తించిన రిజిస్ట్రార్.. ప్రస్తుతం ఉన్న ఫర్నిచర్ రిజిస్టర్‌లో పొందుపరిచి కార్యాలయానికి తాళం వేయించారు. అందులోని వస్తువుల జాబితా పత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణికి అందజేసినట్లు ఆదివారం వెల్లడించారు.

మరో ఢిల్లీ కానుందా?

మడికొండ డంపింగ్ యార్డు పొగతో ఇబ్బందులు

- రాంపూర్, అయోధ్యపురం, మడికొండ, డీజిల్ కాలనీ, ధర్మసాగర్ ప్రాంతాలకు ఎఫెక్ట్
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మడికొండలో మంచుదుప్పటిలా కమ్ముకున్న డంపింగ్ యార్డు పొగ

మడికొండ: డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో మడికొండ మరో ఢిల్లీగా మారనుందా? అని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధి 46, 64వ డివిజన్లు తీవ్ర ప్రభావానికి లోనవుతున్నాయి. మడికొండ శివారులోని డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగ కాజీపేట మండలంలోని మడికొండ, డీజిల్‌కాలనీ, అయోధ్యపురం తోపాటు ధర్మసాగర్, రాంపూర్ గ్రామాల్లో వ్యాపించి ఊపిరాడకుండా చేస్తోంది. డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే ముందు ఇక్కడ వద్దని ఆందోళన చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని.. ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> 'స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. డంపింగ్ యార్డును తొలగించాలని నిర్ణయించాం' అని మడికొండలో అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ ఇచ్చి ఏడాది గడిచినప్పటికీ అమలుకు నోచుకోలేదు.

కమ్ముకుంటున్న పొగ..
ప్రతీ రోజు సాయంత్రమైతే గ్రామం మొత్తం పొగ వ్యాపిస్తోందని మడికొండ చెరువుకట్ట కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటి మడికొండ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తే అతడిపై అధికారులు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేశారని స్థానికులు గుర్తు చేస్తున్నారు. దీనికి తోడు డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగతో ఇబ్బందులు పడుతున్నామని అనేక మార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు.

కాలుష్యం సంగతేంటి?
డంపింగ్ యార్డులో రీ సైక్లింగ్ ప్రక్రియ కొనసాగుతున్నా.. ఒక వైపు చెత్త గుట్టలుగా మారుతోంది. పొగ కారణంగా ఆయా గ్రామాల ప్రజలు శ్వాసకోస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో డంపింగ్ యార్డు నుంచి వచ్చే మురుగునీరు మొత్తం నేరుగా మడికొండ పెద్ద చెరువులోకి చేరి నీరంతా కలుషితం అవుతోంది. గతంలో చేపలు సైతం చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రనిధులు స్పందించి డంపింగ్ యార్డు తరలింపుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రయితే పొగ మంట!
ప్రతీ రోజు రాత్రి పూట డంపింగ్ యార్డు ప్రభావిత గ్రామాల్లో పొగదట్టంగా వ్యాపిస్తోంది. దీని కారణంగా ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి. కళ్లు మండుతున్నాయని, ఛాతిలో మంట వస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుతున్నాయని చెబుతున్నారు.



డంపింగ్ యార్డులో గుట్టలుగా పోగైన చెత్త

ఊపిరాడడం లేదు..



డంపింగ్ యార్డు పొగతో గ్రామంలోని ప్రజలంతా రోగాల బారిన పడుతున్నాం. సాయంత్రం అయిందంటే పొగ పూర్తిగా గ్రామంపైకి వచ్చి ఊపిరి తీసుకోకుండా కమ్ముకుంటోంది. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించాలి.
- నర్ర చంద్రమౌళి ముదిరాజ్, మడికొండ

ఇచ్చిన హామీ నెరవేర్చాలి..



డంపింగ్ యార్డు పొగతో రెండేళ్లుగా ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్నాం. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడతున్నాం. వైద్యానికి ఇప్పటికీ లక్షల్లో ఖర్చయ్యాయి. డంపింగ్ యార్డుతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నాగరాజు డంపింగ్ యార్డును ఎత్తివేస్తానన్న హామీని నెరవేర్చాలి.
- కుక్కల సమ్మయ్య, రిటైర్డ్ ఉద్యోగి, మడికొండ

కార్పొరేటర్ వర్సెస్ చైర్మన్

కీలక ప్రజాప్రతినిధి సాక్షిగా బయటపడ్డ విభేదాలు

- అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకుల లొల్లి.. సర్దిచెప్పిన ప్రజాప్రతినిధి
- తాత్కాలికంగా గొడవకు తెర..

సాక్షిప్రతినిధి, వరంగల్ : 'పదేళ్లు ప్రతిపక్షంలో ఉంటూ అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నాం.. జెండాలు మోశాం.. కేసులనూ భరించాం.. తీరా అధికారంలోకి వచ్చాక పార్టీలు మారి వచ్చిన వారికే పదవులు దక్కుతున్నాయ్' అంటూ ఓ కార్పొరేటర్.. ఓ చైర్మన్‌పై కీలక ప్రజాప్రతినిధి ఎదుట చర్చ పెట్టడం కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో కలకలానికి దారితీసింది. ఈ చర్చ.. రచ్చకు హనుమకొండలో జరిగిన క్రిస్మస్ వేడుకలు వేదిక కావడంతో ఆలస్యంగా బయటకు పొక్కింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. గొడవకు దారితీసిన వివరాలు ఇలా ఉన్నాయి.

హనుమకొండ నడిబొడ్డున ఉన్న ఓ విద్యా సంస్థల అధినేత తన స్కూల్ ఆవరణలో శనివారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించాడు. ఈ ఉత్సవాలకు ఓ కీలక ప్రజాప్రతినిధితో పాటు పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులను ఆహ్వానించారు. హాజరైన ప్రజాప్రతినిధి ముందుగా కేక్ కట్ చేసి సంబురాల్లో పాల్గొనగా.. రాత్రి 11 గంటల తర్వాత కార్పొరేటర్, ఇటీవల ఓ సంస్థకు జిల్లా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వ్యక్తి అందరూ ఒకే చోట కూర్చుని పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్నారు. అక్కడే ఉన్న ఓ కార్పొరేటర్ కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని కేసుల పాలైన, దెబ్బలు తిన్న వారిని కాదని ఎన్నికల ముందొచ్చినా వారికి చైర్మన్ పదవులతోపాటు అధిక ప్రాధాన్యత ఇవ్వడం సరికాదంటూ ప్రజాప్రతినిధి వద్ద చర్చకు తెర తీశాడు. దీంతో అక్కడే ఉన్న సదరు చైర్మన్, కార్పొరేటర్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గొడవ కాస్త భౌతిక దాడులకు దిగే స్థాయికి చేరడంతో కీలక ప్రజాప్రతినిధి వెంట ఉన్న గన్‌మెన్‌లు తమ తుపాకులను ఎక్కుపెట్టి గొడవను సద్దుమణిగేలా చేసినట్లు సమాచారం. గొడవ సీరియస్ కావడంతో చైర్మన్ అక్కడి నుంచి వెళ్లిపోగా.. ప్రజాప్రతినిధి కార్పొరేటర్‌తో పాటు మిగతా కేడర్‌కు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగినట్లు తెలిసింది.

పాలన చేతగాకే అభాండాలు

- నిలదీస్తే చెప్పులు, సీసాలు విసురుతారా?
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

హన్మకొండ: పాలన చేతగాక ప్రతిపక్షంపై సీఎం రేవంత్‌రెడ్డి, పాలక పక్షం అభాండాలు మోపుతున్నట్లు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య ధ్వజమెత్తారు. ఆదివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ చివరి రోజు జరిగిన సమావేశంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే తాము ఏమీ చేయలేక పోతున్నామని చేష్టలుడిగిన సమాధానం చెప్పి ప్రజలను తప్పుదారి పట్టించారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదై సంబరాలు జరుపుకున్న తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గుర్తుకు వచ్చిందా అని ఎద్దేవా చేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సంపద మూడున్నర రేట్లు పెరిగిందని చెప్పారు. పాలన చేయలేక, చేతగాక, చేసే శక్తి లేక, ఆదాయం పెంచుకోలేక ప్రతిపక్షంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను, తప్పులను ప్రశ్నిస్తే, నిరసన తెలిపితే చెప్పులు, సీసాలు విసురుతారా..? ఇదేనా ఎమ్మెల్యేలకు ఇచ్చిన శిక్షణ అని ధ్వజమెత్తారు. దమ్ము, ధైర్యం ఉంటే ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని హనుమకొండ ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. ఆదివారం జులైవాడలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న మౌలిక సదుపాయాలు, మెనూ ప్రకారం భోజనం అందుతుందా? అని ఆరా తీశారు. వార్డెన్, ఫిజికల్ టీచర్, ఏఎన్‌ఎంలను విద్యార్థులకు అందిస్తున్న ఇతర సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం.. పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులకు చదువుతో పాటు ఇతర మెలకువలు నేర్పించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ఆదర్శ పాఠశాలగా ఎదగాలని సూచించారు. అనంతరం ప్రైమరీ స్కూల్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారితో పద్యాలు చదివించారు. కార్యక్రమంలో డీటీడీఓ ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

'సఖి'తో చైతన్యం

- చట్టాలపై అవగాహన సదస్సులు
- టోల్‌ఫ్రీతో 24 గంటల సేవలు



కళాశాలలో అవగాహన కల్పిస్తున్న సఖి సిబ్బంది

కాజీపేట అర్బన్: ఆపదలోని మహిళలకు ఆత్మస్థైర్యం అందించేందుకు తమకు కేటాయించిన చట్టాలపై అవగాహన కల్పించేందుకు, సఖి సేవలపై వన్‌స్టాప్ సెంటర్ అవగాహన సదస్సులను నిర్వహిస్తూ మహిళలను సఖి సిబ్బంది చైతన్యపరుస్తున్నారు. ఆపదలో ఉన్న మహిళలకు మేమున్నామంటూ మనోధైర్యాన్ని కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది సఖి. అన్ని రకాల సమస్యల పరిష్కారానికి కేరాఫ్‌గా నిలుస్తున్న సఖి సేవలను వినియోగించుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

1,116 అవగాహన సదస్సులు
సఖి వన్‌స్టాప్ సెంటర్ హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 2017లో ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు పాఠశాల, కళాశాల, మహిళా సంఘాల్లో 1,116 అవగాహన సదస్సులు నిర్వహించారు. కాగా.. అవగాహన సదస్సుల అనంతరం మహిళలు, బాలికలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించారు. ఇందులో భాగంగా 2,140 వివిధ రకాల సమస్యలతో కేసులు రాగా.. 1,648 కేసులు పరిష్కరించారు. మిగతా కేసులు విచారణలో ఉన్నాయి.

24 గంటలు సేవలందిస్తాం..



ఆపదలోని మహిళలు టోల్‌ఫ్రీ నంబర్లు 181 లేదా హెల్ప్‌లైన్ నంబర్ 7382983088లో ఫిర్యాదు చేస్తే చాలు.. సఖి సేవలు అందజేస్తాం. 24 గంటలు సఖి సేవలు అందుబాటులో ఉంటాయి. ఆపదలోని మహిళలకు అండగా నిలిచేందుకు సఖి సేవలు అందిస్తోంది.
- పల్లెపాడు దామోదర్, డైరెక్టర్, సఖి సెంటర్

వన్‌స్టాప్ సొల్యూషన్



మహిళలు ఎదుర్కొంటున్న గృహ హింస, లైంగిక వేధింపులు, మహిళలు, పిల్లల అక్రమ రవాణా, అత్యాచారాలు, యాసిడ్ దాడులు వంటి వివిధ సమస్యల పరిష్కారానికి సఖి వన్‌స్టాప్ సెంటర్ తోడ్పాటు నందిస్తుంది. బాధిత మహిళలకు తక్షణ సాయంగా తాత్కాలిక వసతి, వైద్య సహాయం, పోలీస్, లీగల్ కౌన్సెలింగ్ అందిస్తూ భరోసా కల్పిస్తున్నాం. ఆపదలోని మహిళలు సఖి సేవలు వినియోగించుకునేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం .
- జయంతి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి

మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీ

- మూడు కేసులు నమోదు
- వ్యాపారులకు జరిమానా



హనుమకొండలో మటన్ వ్యాపారి షాపును తనిఖీ చేస్తున్న జిల్లా తూనికలు, కొలతల అధికారి శ్రీలత

హన్మకొండ: హనుమకొండ, కాజీపేటలోని కూరగాయలు, చికెన్, ఫిష్ మార్కెట్‌లను తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని కూరగాయల మార్కెట్, ఎక్సైజ్ కాలనీలోని రైతు బజార్, కాజీపేటలోని కూరగాయలు, ఫిష్ మార్కెట్‌ను సిబ్బందితో కలిసి హనుమకొండ జిల్లా తూనికలు, కొలతల అధికారి శ్రీలత తనిఖీ చేశారు. కాంటాలు, బాట్లు పరిశీలించారు. 30 మంది వ్యాపారుల షాపులను తనిఖీ చేశారు. స్టాంపులు లేని బాట్లు స్వాధీనం చేసుకున్నారు. స్టాంపులు వేయించుకోకుండా వేయింగ్ మిషన్‌లు వాడుతున్న ఇద్దరు చికెన్, ఒక ఫిష్ వ్యాపారి నుంచి రూ.5 వేలు జరిమానా వసూలు చేశారు. ప్రతీ వ్యాపారి దగ్గరకు వెళ్లి కాంటాలు, తూనికల రాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బరువులో తేడా, కాంటాల్లో మోసాన్ని పరిశీలించారు. వినియోగదారులను మోసం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు. ఏటా తమ తూనికల రాళ్లకు, వేయింగ్ మిషన్లకు స్టాంపులు వేయించుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా కాంటాలు, వేయింగ్ మిషన్లు, బాట్లు వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మతోన్మాద విధానాల్ని వ్యతిరేకించండి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

న్యూశాయంపేట: బీజేపీ మతోన్మాద విధానాల్ని వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. ఆదివారం హనుమకొండలోని పార్టీ ఆఫీస్‌లో జిల్లా కమిటీ సభ్యుడు చక్రపాణి అధ్యక్షతన విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగయ్య మాట్లాడుతూ.. మతోన్మాద భావజాలాన్ని ప్రజల్లోకి చొప్పించడం వీలు కావడం లేదనే కుట్రతో అప్పుడప్పుడూ కేంద్రంలోని బీజేపీ సర్కారు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తోందన్నారు. అసెంబ్లీలో ఒక్కొక్కరు నిందలు వేసుకోవడం తప్ప ప్రజా సమస్యలపై చర్చలు లేవన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వాసుదేవరెడ్డి, చుక్కయ్య, వెంకట్, వీరన్న, రాములు తిరుపతి, దీప్ లింగయ్య, భానునాయక్ మండల కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు, ప్రజాసంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరింత చేరువయ్యేలా..



వినియోగదారులకు మరింత చేరువయ్యేలా టీజీ ఎన్పీడీసీఎల్ సేవల్ని విస్తరిస్తోంది. అందులో భాగంగా ప్రత్యేక వాహనాన్ని డిజైన్ చేసింది. ఆ వాహనంపై రాసిన టోల్ ఫ్రీ నంబర్ 1912ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తున్నారు. వినియోగదారులకు ఎదురయ్యే సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నంబర్ ఉపయోగపడుతుందని, వాహనం ద్వారా మెరుగైన సేవలందుతాయని అధికారులు చెబుతున్నారు. నగరంలో ఎమర్జెన్సీ సేవలు అందించేందుకు ప్రత్యేకంగా డివిజన్‌కు రెండు ట్రాన్స్‌పోర్టు వాహనాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా క్షణాల్లో వాహనాలు చేరుకుంటున్నాయి. **– హన్మకొండ**

అల్లు అర్జున్ వ్యవహార శైలి సిగ్గుచేటు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: తొక్కిసలాటలో ఓ తల్లి ప్రాణాలు కోల్పోయి, బిడ్డ చావుబతుకుల మధ్య ఉంటే కనీసం పశ్చాత్తాపం లేకుండా అల్లు అర్జున్, ఆయన తండ్రి అరవింద్ మాట్లాడుతున్న తీరు సిట్టుచేటని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ డీసీసీ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తక్షణ సాయం ప్రకటించకుండా తనను అవమానిస్తున్నారంటూ మాట్లాడడం సరికాదన్నారు. ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడి అన్నట్లుగా ప్రతిపక్షాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పాప్‌కార్న్‌పై 12 శాతం జీఎస్టీ విధిస్తే బండి సంజయ్‌కి సోయే లేదని విమర్శించారు. రెండు సార్లు మంత్రి పదవి, పీసీసీ చీఫ్ పదవులు అనుభవించిన ఓ పెద్ద మనిషి, కబ్జా చేసి నిర్మించిన పార్టీ ఆఫీసులో కూర్చుని కాంగ్రెస్‌ను విమర్శించడం వలన ఆయనపై ఉన్న గౌరవం పోయిందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ చేసిన అక్రమాల కేసుల్లో వారిని భగవంతుడు కూడా కాపాడలేదని అన్నారు. తమకు అందరూ సమానమేనని తప్పు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, పల్లకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వంటా వార్పు..

- కొనసాగుతున్న సర్వశిక్ష ఉద్యోగుల సమ్మె



వంటావార్పుతో నిరసన తెలిపి అక్కడే భోజనం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

విద్యారణ్యపురి: సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉద్యోగులు నగరంలోని ఏకశిల పార్కువద్ద చేపట్టిన దీక్షల్లో భాగంగా ఆదివారం వంటావార్పు చేపట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు దొనికెల శ్రీధర్, ఎండీ.షఫీ మాట్లాడుతూ పేస్కేల్ వర్తింపచేయాలని, రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ 16 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవటం శోచనీయమన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. వంటా వార్పు అనంతరం శిబిరం వద్ద భోజనాలు చేశారు.

క్లుప్తంగా

‘గిన్నిస్’ లోకి హనుమంతపురి..

● దేవస్థాన ఆవరణలో 963మందితో కోలాటం ప్రదర్శన



జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొప్పూర్ శివారులోని గద్దల బండపై వెలసిన పంచ ముఖ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని గిన్నిస్ రికార్డు వరించింది. ఆదివారం ఆలయ ప్రాంగణంలో హనుమాన్ చాలీసా మీద కోలాటం నిర్వహించారు. ఈ కోలాటం గిన్నిస్ రికార్డులోకి ఎక్కింది. గతంలో 429 మందితో నిర్వహించగా.. ఈ సారి 963 మంది మహిళలతో నిర్వహించి రికార్డు సాధించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు భారత్ కోఆర్డినేటర్ వెంకటరమణరావు.. ఆలయ చైర్మన్ కాసం రమేశ్‌కు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ముఖ్య తిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ప్రతీ ఒక్కరిని సన్మార్గంలో నడిపించడానికి కోలాట ప్రదర్శన దోహదపడుతుందన్నారు. కాగా, హనుమంత్‌పురిని గిన్నిస్ రికార్డు వరించడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వంగ రవీందర్, రాజమణి, సమ్మయ్య పాల్గొన్నారు.

కేయూ ఇయర్ వైజ్ స్కీం

● ఒక్కో పేపర్‌కు రూ.4వేల ఫీజు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల ఇయర్‌వైజ్ స్కీం విద్యార్థులకు బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్షలు రాసుకునేందుకు ఫీజు చెల్లించేందుకు పరీక్షల విభాగం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. బీఏ, బీబీఎం, బీకాం, బీఎస్సీ, బీఏ(ఎల్), బీసీఏ, బీ ఒకేషనల్ నాన్ ప్రొఫెషనల్ కోర్సుల ఇయర్‌వైజ్ స్కీం విద్యార్థులు బ్యాక్ లాగ్ సబ్జెక్టుల పరీక్షలు రాసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ వెంకటయ్య తెలిపారు. ఒక్కో పేపర్‌కు రూ.4 వేల ఫీజు చెల్లించాల్సుంటుందని, అపరాధ రుసుము లేకుండా ఫిబ్రవరి 1 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగతా వివరాలకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం అకడమిక్ బ్రాంచ్‌లో సంప్రదించాలన్నారు.

తోటి తెగ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా రఘు

గీసుకొండ: గీసుకొండ మండలంలోని జాన్‌పాకలో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆదివాసీ తోటి తెగ సేవ సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా గుగ్రం రఘు, గౌరవ అధ్యక్షుడిగా సోమ సాంబయ్య, ఉపాధ్యక్షులుగా ఆకుల రమేశ్, గుగ్రం హరీశ్, సోయం వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా గుగ్రం మధు, సహాయ కార్యదర్శులుగా షెడ్మాకి సదానందం, గుగ్రం అజయ్, కోశాధికారిగా ఆకుల యాదగిరి, ప్రచార కార్యదర్శులుగా గుగ్రం రాజశేఖర్, గేడెం క్రాంతి, సోయం శరత్‌బాబు, మరో ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులు, సలహాదారులుగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.



నిను మరవలేదు ఈ గడ్డ!

వంగర బిడ్డ మన పీవీ..

● దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి
● తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన మహానేత
● తెలుగుజాతి గర్వించ దగిన నాయకుడు.. ప్రజల గుండెల్లో ఇంకా పదిలం
● నేడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 20వ వర్ధంతి



పీవీ నర్సింహారావు

ఎల్కతుర్తి : పాములపర్తి వెంకట నర్సింహారావు.. ఆ పేరు ఎరగని వారు ఉండరు. భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర ముద్దుబిడ్డ కావడం గర్వకారణం. సమాచార, ఆర్థిక సంస్కరణలకు బీజం వేసిన ఆయన పేరును ఇప్పటికీ దేశవ్యాప్తంగా పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉచ్ఛరిస్తూనే ఉంటారు. దేశ రాజకీయాల్లో చెరగని ముద్రవేసుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి.. బహుభాషాకోవిదుడు.. తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి.. భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి నేడు(సోమవారం). మౌనమునిగా పేరుగాంచిన పీవీ మన దేశానికి ఎనలేని సేవలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయనకు సముచిత గౌరవాన్నిచ్చి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించింది. 2020 జూన్ 28 నుంచి 2021 జూన్ 28 వరకు పీవీ శతజయంతి ఉత్సవాలు నిర్వహించింది. కాగా, 2023 అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారికంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. 2024 ఫిబ్రవరి 9న కేంద్రం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది.



వంగరలో పీవీ ఇల్లు. ఇన్‌సెట్‌లో ఆయన వాడిన కారు

ఉగ్గుపాల నుంచే ఉద్యమ బాట..

పీవీ స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర కాగా, ఆయన అమ్మమ్మగారి ఊరైన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలో 1921, జూన్ 28న జన్మించారు. పీవీ తల్లిదండ్రులు సీతారామారావు, రుక్మిణి. వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం మొదలు పెట్టిన పీవీ.. హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. కళాశాల చదువుకోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరారు. అక్కడ వందేమాతరం ఆలపించడంతో సహచరులతోపాటు పీవీని విశ్వవిద్యాలయం నుంచి అప్పటి నిజాం ప్రభుత్వం బహిష్కరించి.. తమ ఏలుబడిలోని ఏ ప్రాంతంలోనూ చదివేందుకు వీలు లేదని నిషేధం విధించింది. దీంతో మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించారు. బీఎస్సీ, ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశారు. విద్యార్థి దశ నుంచే నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. కొంతకాలం అజ్ఞాతవాసం ఉండి చాందా క్యాంపులో క్రియాశీలకపాత్ర పోషించారు. అనంతరం ఊహించని పరిణామాలు చోటుచేసుకోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యారు.

వంగరలో నేడు వర్ధంతి

వంగరలో సోమవారం పీవీ వర్ధంతి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే వేడుకల్లో రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ వాణీదేవితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

ఆయనంటేనే కాంగ్రెస్..

ప్రతీ ఆపద సమయంలో పీవీ నర్సింహారావు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా క్లిష్టసమయాల్లో బాధ్యతలు స్వీకరించారు. ముల్కీ నిబంధనలు చట్టవిరుద్ధమని చెప్పిన సుప్రీం కోర్టు తీర్పును బహిరంగంగా స్వాగతించినందుకు అప్పటి సీమాంధ్రనేతలు ఆయనపై కక్షగట్టారు. భూసంస్కరణల చట్టం అమలుకు ఏకంగా ఆర్డినెన్స్ తేవడం తెలంగాణ–ఆంధ్రా నేతలకు కంటగింపుగా మారింది. ఫలితంగా పీవీ ముఖ్యమంత్రి పదవీచ్యుతుడయ్యారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన భారతదేశాన్ని ప్రధానిగా తన శక్తియుక్తులతో గట్టెక్కించారు. మెజారిటీ లేని తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ఎన్నో నిందలు, అవమానాలు భరించారు. రాజకీయాల్లో క్లిష్టపరిస్థితుల్లోనే ఆయన ఏ పదవిని చేపట్టినా అది ప్రజల పక్షంగానే నడిచింది. కవి, రచయిత, అనువాదకుడు, కథకుడు, పాత్రికేయుడిగా ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. 1951లో అఖిల భారత కాంగ్రెస్ సభ్యుడిగా మొదలు.. దేశ ప్రధాని వరకు ఆయన ప్రజల మనిషిగానే పనిచేశారు. 1996లో ప్రధానమంత్రి పదవీకాలం ముగిశాక పీవీ క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. చివరకు పీవీ 2004 డిసెంబర్ 23న కన్నుమూశారు.

మరుపు వస్తలేదు..



పీవీ దొరని చూసినోళ్లు.. మాట్లాడినోళ్లు ఎప్పటికీ మరచిపోరు.. ఆయన చచ్చిపోయి ఇరవయ్యేళ్లయితన్న మరుపు వస్తలేదు. పనిచేసేవారితో ప్రతీ ఒక్కరిని మంచిగా పలుకరించేది. ఆతర్వాత పీవీ దొర హైదరాబాద్, అక్కడినుంచి ఢిల్లీకి వెళ్లి వచ్చేవారు. గ్రామంలో దవాఖాన, పోలీస్‌స్టేషన్, కరెంట్ దొరవారు చేయవట్టే ముల్కనూర్ కంటే వంగరకే ముందుగాల వచ్చింది.

– రామారపు నర్సయ్య, వంగర గ్రామస్తుడు

దొరగారి ఇంట్లో పనిచేసిన..



పీవీ దొరవారి ఇంట్లో 1975–76లో పాలేరుగా పనిచేశా. ఆయన కోళ్లఫాం పెడితే అందులోనూ పని చేసిన. దొరకు సుమారు 50ఎకరాల వరకు చెల్క ఉండేది. మొక్కజొన్న చెలుక ఎంబడి తిరుగుంటూ ఆవులను మేపేవాడిని. పీవీ దొర చాల మంచోడుండే. ముల్కనూరు కంటె ముందుగాల మా ఊళ్లకు కొన్ని సౌలతులు వచ్చినయంటే ఆయనే కారణం.

– కాల్వ మల్లయ్య, వంగర గ్రామస్తుడు

కాళోజీ జీవితం..విశ్వవ్యాప్తం

నేడు ‘ప్రజాకవి కాళోజీ’ చిత్రం విడుదల

● డిసెంబర్ 29 వరకు మార్నింగ్ షో విద్యార్థులకు ఉచితం
● కాళోజీ స్ఫూర్తిని రగిలించేలా బయోపిక్
● చైతన్యం చేయడమే నాలక్ష్యం: డైరెక్టర్ ప్రభాకర్ జైనీ



ప్రజాకవి కాళోజీ సినిమా పోస్టర్

హన్మకొండ కల్చరల్ : చిన్నప్పటి నుంచి వెండితెరను ఏలాలనే ఆకాంక్ష.. ఆకాంక్ష మేరకే ఓ విశ్రాంత ఉద్యోగి సినిమా బాట పట్టారు. ఉన్నత విద్యనభ్యసించి విదేశాల్లో స్థిరపడే అవకాశమున్నా ఆవైపు వెళ్లలేదు. అభిరుచితో సినిమా రంగం వైపు కదిలారు. పలు చిత్రాలు తీస్తూ తెలుగు ప్రజలను మెప్పిస్తున్నారు. పల్లెటూరు అందాలు, కుటుంబ బంధాలు, అనుబంధాలను మేళవిస్తూ సహజ దర్శక నిర్మాతగా చక్కటి సినిమాలకు ప్రాణం పోస్తున్నారు. ఆయననే డాక్టర్ ప్రభాకర్ జైనీ.

వెండి తెరపై జైనీ..

డాక్టర్ ప్రభాకర్ జైనీ జన్మ స్థలం వరంగల్. కమర్షియల్ ట్యాక్సెస్ అసిస్టెంట్ కమిషనర్‌గా రిటైర్డ్ అయ్యారు. చిన్నప్పటి నుంచి సినిమా లంటే ఇష్టం. ఉద్యోగం చేస్తూనే సినిమా రంగం వైపు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయినా అవకాశాలు రాలేదు. దీంతో తక్కువ బడ్జెట్‌లో సినిమా తీయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ‘జైనీ క్రియేషన్స్’ పేరుతో సినిమాలు చేయడం ప్రారంభించారు. తాను రచించిన 40 నవలలు, 250 కవితల నుంచి ప్రధాన అంశాలను తీసుకుని మూడు సినిమాలు తెరకెక్కించారు. ఈ సినిమాలను ప్రజలు ఆదరించారు. 2014లో తీసిన నవల ‘నా సినిమా సెన్సార్ అయిపోయిందోచ్!’కు నంది అవార్డు లభించింది. ప్రభుత్వం నుంచి అనేక మార్లు ప్రశంసలు పొందారు. కాగా, ప్రజాకవి కాళోజీ చిత్రం 2022లో పూర్తి చేసుకుంది. ప్రస్తుతం సెన్సార్ పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది.

నేడు ప్రజాకవి కాళోజీ చిత్రం విడుదల

స్వరాష్ట్ర ఉద్యమానికి ఊపిరిపోసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని ‘ప్రజాకవి కాళోజీ’ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాకు నిర్మాత విజయలక్ష్మి జైనీ, కథ–మాటలు–స్క్రీన్‌ప్లే దర్శకత్వం ప్రభాకర్‌జైనీ వ్యవహరించారు. ఈ సినిమా తీసి ప్రజాకవి కాళోజీకి ప్రాణం పోశారు. ప్రేక్షకులకు వినోదం అందించడమే కాదు, సమాజానికి సందేశాన్నిచ్చే చక్కటి చిత్రం. సోమవారం ఉదయం ‘ప్రజాకవి కాళోజీ’ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ నెల 23 నుంచి ఈనెల 29 వరకు ఉదయం ఆటలలో పాఠశాలల విద్యార్థుల కోసం వరంగల్‌లో రాధిక, జెమిని, హనుమకొండలోని అశోక థియేటర్‌లో ఉచితంగా ప్రదర్శించబడుతుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి.. డీఈఓకు పంపించారు.

వారం రోజులు ఉచితం



మంచి చిత్రాలు తీయడమే లక్ష్యంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితాన్ని సినిమాగా తెరకెక్కించా.. తక్కువ బడ్జెట్‌తో గ్రామీణ కళాకారులతో సినిమాను రూపొందించా. ‘ప్రజాకవి కాళోజీ’ చిత్రాన్ని వారం రోజుల పాటు ఉదయం ఆటలలో విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించాం.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–ప్రభాకర్ జైనీ, ‘ప్రజాకవి కాళోజీ’ చిత్రం దర్శక, నిర్మాత

29న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–17 బాలబాలికల చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ఎదుట ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిసున్న పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2008, ఆ తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. క్రీడాకారుల పేర్ల రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉద్యోగులను మోసగించడానికే యూపీఎస్

● టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ



మాట్లాడుతున్న స్థిత ప్రజ్ఞ

రామన్నపేట : ఉపాధ్యాయ, ఉద్యోగులను మోసం చేయడానికి 2025, ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) తీసుకొస్తోందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ అన్నారు. ఆదివారం వరంగల్‌లోని ఇస్లామియా కాలేజీ మైదానంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ కుమార్ అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ ఆర్టికల్ 51 ప్రకారం పౌరులకు కంట్రిబ్యూషన్ లేని పెన్షన్ పొందడం హక్కు అన్నారు. పాత పెన్షన్ విధానంలో ఉద్యోగికి గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్, డీఏ ఆధారిత సర్వీస్ పెన్షన్, కమ్యూటేషన్ సౌకర్యాలను కలిగి ఉంటుందన్నారు. అదే యూపీఎస్ విధానంలో ఉద్యోగి, ప్రభుత్వ నెల వారీ కాంట్రిబ్యూషన్ ద్వారా జమైన పెన్షన్ నిధిని ఎంపీఎస్ ట్రస్ట్‌కు బదిలీ చేస్తే గాని సర్వీస్ పెన్షన్ నిర్ణయం జరగదన్నారు. ఇది తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అంశమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ మాట్లాడుతూ సీపీఎస్ విధానంలో రిటైర్డ్ అయిన హైకోర్టు జడ్జి, విశ్రాంతి న్యాయమూర్తులకు కేవలం రూ.6 నుంచి రూ.15 వేల పెన్షన్ మాత్రమే అందుతుందన్నారు. సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసేలా ఈ నూతన పెన్షన్ విధానం ఉందన్నారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఈడిగి నరేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు లింగమూర్తి, బుచ్చన్న, జిల్లా నాయకులు రవీందర్ రెడ్డి, అఫ్జల్, కొండా శ్రీనివాస్, లక్ష్మణమూర్తి, దిల్షాన్, రవికాంత్, నాగముని, లక్ష్మీకాంత్, తోటావిక్రమ్, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్ధశతాబ్దపు ఆత్మీయ కలయిక..





గురువును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పూర్వ విద్యార్థులు



వేడుకలకు హాజరైన పూర్వ విద్యార్థులు

పాఠశాల వేదికగా 50 బ్యాచ్‌ల విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

● మధుర స్మృతులు, జ్ఞాపకాలు నెమరవేసుకున్న స్నేహితులు

జఫర్‌గఢ్: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా అర్ధశతాబ్దపు (బ్యాచ్‌లు) విద్యార్థులంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. బామ్మల వయస్సులో బాల్య మిత్రులను కలుసుకున్నారు. ఒకరినొకరు చూసుకుంటూ అతి కష్టంగా గుర్తు పట్టుకుని భావోద్వేగాలకు గురయ్యారు. 50 సంవత్సరాల బ్యాచ్‌లకు చెందిన వారందరూ ఒకే వేదిక ద్వారా కలుసుకున్నారు. ఈ అపురూప ఘటన కూనూర్ ఉన్నత పాఠశాల్లో ఆవిష్కృతమైంది. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కాగా, పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోవాలనే ఆలోచన పూర్వ విద్యార్థి నాగమళ్ల అశోక్‌కు మదిలో మెదిలింది. ఈ విషయం తన బాల్యమిత్రులతో చర్చించడంతో వారు కూడా స్పందించి పాఠశాల ప్రారంభమైన 1973–74 నుంచి 2023– 24 బ్యాచ్‌లకు చెందిన 4,500 మంది విద్యార్థులు, 150 మంది గురువుల వివరాలను సేకరించారు. అనంతరం ఆదివారం ఒకచోట.. ఒక వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

గురువులకు ఘన సన్మానం

పాఠశాల ఏర్పడినప్పటి నుంచి.. నేటి వరకు 150 మంది గురువులకు గాను వందిమంది వేడుకలకు హాజరు కావడం విశేషం. అదే విధంగా 4, 500 మంది విద్యార్థులకు సుమారు మూడు వేల కు మందికి పైగా ఈ వేడులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు.

50 ఏళ్ల స్వర్ణోత్సవ సావనీర్ ఆవిష్కరణ

పాఠశాలలో 50 ఏళ్ల నుంచి నేటి వరకు నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల విశేషాలతో కూడిన సావనీర్‌ను ఆష్కరించారు. 50 ఏళ్లకు సంబంధించిన 50 బ్యాచ్‌ల విద్యార్థుల గ్రూప్ ఫొటోలు, గురువుల అనుభవాలను పొందుపరుస్తూ ఈ సావనీర్‌ను రూపొందించారు.

స్వర్ణోత్సవ వేడుకలు అభినందనీయం..

కాగా, ఈ కార్యక్రమానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 50 ఏళ్ల నుంచి పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమం ఇప్పటి వరకూ ఏ పాఠశాలలో జరగలేదన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలకు 12 కంప్యూటర్లతో పాటు అదనపు గదులు, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

ఆనందంగా ఉంది



పాఠశాలలో 50 ఏళ్ల పూర్వ విద్యార్థులకు సంబంధించిన గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహిచడం ఆనందంగా ఉంది. నాతో పాటు తోటి పూర్వ విద్యార్థులు తొమ్మిది నెలల పాటు కృషి చేయడంతోనే ఈ కార్యక్రమం విజయవంతం అయ్యింది.

– నాగమళ్ల అశోక్, కమిటీ కన్వీనర్

49 ఏళ్లకు కలుసుకోవడం సంతోషంగా ఉంది

పాఠశాలలో 1974 బ్యాచ్‌కి చెందిన నా బాల్య మిత్రులను 49 ఏళ్ల తరువాత కలుసుకోవడం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నాం.

–మత్తటి రాంరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం

వేడుకలు జీవితాంతం గుర్తుంటాయి



18 సంవత్సరాల తరువాత ఈ వేడుకల సందర్భంగా పాఠశాలకు రావడం ఆనందంగా ఉంది. ఈ వేడుకలు నాకు జీవితాంతం గుర్తుంటాయి.

– మౌనిక, పూర్వ విద్యార్థిని

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ Thorrur Main road Opp: Govt. High School to let for 1st floor (for companies) minimum 5yrs agreement. Cell: 9059294384, 7306414384 [W-1237377]

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [H-783410]

BUSINESS OFFER

■ Franchise Offer on Abroad Study & Job Agency Interested people contact for more details WhatsApp 9492251262 [HA-8203]

WANTED

■ కన్‌స్ట్రక్షన్ సైట్ సూపర్విజన్ కొరకు సివిల్ ఇంజనీర్ కావలెను. అనుభవం తప్పనిసరి. సెల్: 9985664653, 9963285321. [W-1264163]

■ Wanted Computer Operator. Part / Full Time (Male / Female). Opp: SBI Bank, Under Bridge Road, Perukawada, Warangal. Cont: 7981380146. [W-1264158]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256014]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA24000888]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యార్థుల వివాదంపై కమిటీ నియామకం

కేయూ క్యాంపస్: కేయూలో బీపీఈడీ , ఎంబీఏ విద్యార్థుల మధ్య ఇటీవల వివాదం తలెత్తిన విషయం విధితమే. క్రీడామైదానంలో ఎంబీఏ విద్యార్థులు క్రికెట్ ఆడుతుండగా పలువురు బీపీఈడీ స్టూడెంట్స్ వచ్చి తాము ఆడుకోవాల్సిన గ్రౌండ్‌లోమీరెలా ఆడుతారని అడ్డుకుని వాగ్వావాదానికి దిగి కొట్టారని ఆరోపిస్తూ ఎంబీఏ విద్యార్థులు ఆందోళన చేసి రిజిస్ట్రార్ మల్లారెడ్డికి విన్నవించిన విషయం విధితమే. ఈ ఘటనపై విచారించడానికి కమిటీని నియమించినట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఆదివారం తెలిపారు. చైర్మన్‌గా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ లాల్, సభ్యులుగా కామర్స్,బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ఏటీబీటీప్రసాద్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డైరెక్టర్ నిరంజన్ శ్రీనివాస్ ఉన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్ : ఆర్థిక ఇబ్బందులు తాళలేక కాజీపేటకు చెందిన కొబ్బరి బొండాల వ్యాపారి బాలరాజు (56) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై టి.నాగరాజు కథనం ప్రకారం.. బాలరాజు కొంత కాలం నుంచి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆదివారం కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ నగర్ కాలనీలో ఆటో డ్రైవర్..

కాజీపేట : కుటుంబ కలహాలతో కాజీపేట వైఎస్సార్ నగర్ కాలనీలో ఆటోడ్రైవర్ అంగిడి రాజశేఖర్ (38) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. రాజశేఖర్ విడాకులు పొంది ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


పత్తి చేనులో గంజాయి మొక్క

● సీడ్ కోసం పెంచుతున్నట్లు అంగీకారం

హసన్‌పర్తి: మండల పరిధి మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఓ పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆదివారం దాడులు చేశారు. గ్రామానికి చెందిన కొత్తూరు కిషన్ పత్తి చేనును పరిశీలించగా అందులో గంజాయి మొక్క లభించింది. కిషన్‌కు మూడెకరాల వ్యవసాయం భూమి ఉండగా.. ఎకరంలో పత్తి సాగు చేశాడు. అందులోని గంజాయి మొక్కను ఆకుల వాసనతో గుర్తించిన పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. గంజాయి విత్తనాల కోసం మొక్కను పెంచుతున్నానని, విత్తనాలు వచ్చాక ఎండబెట్టి పంట సాగు చేయాలని నిర్ణయించినట్లు కిషన్ విచారణ సందర్భంగా చెప్పాడని పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. పంచనామా చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.


అమెరికాలో తెలుగు విద్యార్థి అనుమానాస్పద మృతి

● మాదన్నపేటలో విషాదం
● మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని గ్రామస్తుల వినతి



వంశీ (ఫైల్)

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన విద్యార్థి బండి వంశీ(25) శనివారం రాత్రి అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మాదన్నపేటలో కల్లుగీత వృత్తితో పాటు వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే బండి రాజయ్య–లలిత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరి చిన్న కుమారుడు వంశీ సుమారు రెండేళ్ల క్రితం ఉన్నత చదువుల(ఎంఎస్) కోసం అమెరికాకు వెళ్లాడు. కాంకోర్డియా సెయింట్ పాల్ విశ్వవిద్యాలయం చదువుతూ.. 8580 మాగ్నోలియా ట్రైల్ ఈడెన్ ప్రైయిరీ అపార్ట్‌మెంట్, రూం నంబర్ 206, మిన్నెసోటా 55344లో ఉంటున్నాడు. శనివారం రాత్రి అపార్ట్‌మెంట్ కింద ఉన్న సెల్లార్‌లో పార్కు చేసి కారులో వంశీ ఉరి వేయబడి అనుమానాస్పద స్థితితో మృతి చెందాడు. సమాచారం అందుకున్న అక్కడి పోలీసులు మృతదేహాన్ని తరలిస్తున్న సమయంలో.. పక్క అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న కంతాత్మకూర్ వాసి విషయాన్ని ఫోన్ ద్వారా తన తల్లిదండ్రులకు తెలుపగా వారు వంశీ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వంశీ మృతితో మాదన్నపేటలో విషాదం అలుముకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వంశీ మృతదేహాన్ని త్వరితగతిన స్వస్థలానికి తెప్పించాలని, మృతికి కారకులను చట్టపరంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఇదిలా ఉండగా.. వంశీ మృతి విషయాన్ని స్థానిక బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి మృతదేహాన్ని త్వరగా తీసుకొచ్చేలా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు.



వంశీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రణవ్

మృతదేహాన్ని తెప్పించేందుకు కృషి చేస్తా : ప్రణవ్

అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వంశీ మృతదేహాన్ని ప్రభుత్వ పరంగా వీలైనంత త్వరితగతిన స్వగ్రామానికి తెప్పించేందుకు తన వంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ తెలిపారు. ఆయన మాదన్నపేటకు వెళ్లి వంశీ తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.